క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): బొల్లారం, మెల్లకుంట తండా, బంజర గ్రామాల్లోని అంగన్‌వాడి కేంద్రాలను సోమవారం ఎంపీడీవో రఘు, ఐసీడీఎస్ సీడీపీవో సరిత, ఎంపీవో శ్రీనివాస్ తనిఖీ చేశారు. అంగన్‌వాడి టీచర్లు, ఆయాలు సమ్మె బాట పట్టిన నేపథ్యంలో గ్రామాలలో అంగన్‌వాడి కేంద్రాల నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా కార్యదర్శులు, వీవోఏల సహాయంతో చర్యలు చేపట్టారు. దీంతో పాటు కేంద్రాలలోని స్టాక్, రికార్డులను వారు పరిశీలించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరీ బాయి ఉన్నారు.

తాడ్వాయిలో వాహనాలు..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని కామారెడ్డి -ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో సోమవారం పోలీసుల ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో పాటు సీటు బెల్టు పెట్టుకోకపోవడం, హెల్మెట్లు ధరించని వారికి జరిమానా విధించారు. ఏఎస్సై సంజీవులు, కానిస్టేబులు, హోంగార్డులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం



ఎల్లారెడ్డి: పట్టణంలోని జీవదాన్ పాఠశాల విద్యార్థులు, యాజమాన్యం కిడ్నీ బాధితుడి కుటుంబానికి సోమవారం రూ. 25 వేల ఆర్థిక సాయం అందించారు. లింగంపేట మండలంలోని జల్దిపల్లి గ్రామానికి చెందిన అల్లం రవికి రెండు కిడ్నీలు పాడై పోవడంతో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్‌కు గాను జీవదాన్ పాఠశాల వారు ఆర్థిక సహాయాన్ని అందించారు. పాఠశాల యాజమాన్యానికి బాధితుడి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

సంగోజివాడిలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): సంగోజివాడి గ్రామంలో సోమవారం బాధిత కుటుంబానికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ప్రశాంత్ తల్లి రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకొని మదన్‌మోహన్‌రావు అక్కడికి వెళ్లి ఆమెను పరామర్శించి కొంత ఆర్థిక సాయం చేశారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మాచారెడ్డిలో..



మాచారెడ్డి: మండలంలోని గజ్యా నాయక్ తండా చౌరస్తాకు చెందిన శ్రీనివాస్ అనే ఆటో డ్రైవర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో మండల ఆటో యూనియన్ ప్రతినిధులు బాధిత కుటుంబానికి రూ.20 వేల నగదు, 50 కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ మండల శాఖ అధ్యక్షుడు మల్లేష్ యాదవ్, మాజీ అధ్యక్షుడు పిట్ల కృష్ణంరాజు, ఆటోవాలాలు ఉన్నారు.

రెండో విడత దుస్తుల పంపిణీ

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రెండవ విడత యూనిఫాం దుస్తులు పంపిణీ చేయనున్నట్లు ఎంఈవో రాములు నాయక్ తెలిపారు. దుస్తులతో పాటు రాగిజావ పిండి పంపిణీ చేస్తున్నామని, మంగళవారం నుంచి ప్రధానోపాధ్యాయులు ఎంఈవో కార్యాలయానికి వచ్చి తీసుకెళ్లాలని కోరారు.

తినేముందు చేతులు కడుక్కోవాలి



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): విద్యార్థులు చేతులను శుభ్రంగా కడిగి భోజనం చేయాలని ఆర్బీఎస్కే వైద్యులు సంగీత సూచించారు. సోమవారం ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. అనంతరం వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కళాశాల అధ్యాపకులు రమేష్, సిబ్బంది ఉన్నారు.

పంటల పరిశీలన

నిజాంసాగర్(జుక్కల్): తున్కిపల్లి, తుర్కపల్లి, బూర్గుల్ శివారుల్లోని పంట పొలాలను సోమవారం క్లస్టర్ ఏఈవో మధుసూదన్ పరిశీలించారు. ఆయా గ్రామాల్లో సాగు చేసిన వరి పంటలకు మొగి పురుగు ఆశించిందన్నారు. వాతావరణ పరిస్థితుల్లో మార్పులు వస్తే పంటలపై తెగుళ్ల బెడద తగ్గుతుందని చెప్పారు. మొగిపురుగు నివారణకు క్లోరో 50ఈసీ ఎకరానికి 250 ఎంఎల్ మందును పిచికారీ చేయాలని రైతులకు ఆయన సూచించారు.

సెట్టింగ్‌లు అదిరేలా..!

- వినాయక మండపాల ఖర్చుకు వెనకాడని నిర్వాహకులు
- విభిన్నంగా తీర్చిదిద్దేందుకే ప్రాధాన్యం
- భారీ సెట్టింగులకు ఏటా పెరుగుతున్న డిమాండ్
- పూజలతో పాటు డెకరేషన్‌పై దృష్టి





లైటింగ్స్, విభిన్న సెట్టింగ్‌లతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న వినాయక మండపాలు(ఫైల్)

కామారెడ్డి రూరల్: వినాయక ఉత్సవాలు సమీపిస్తున్నాయి. వాడవాడలా వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు మంటపాలు రూపుదిద్దుకోనున్నాయి. దశాబ్దం క్రితం విగ్రహాలను నెలకొల్పి తాత్కాలికంగా రేకులషెడ్డు వేసేవారు. బల్లలపై ప్రతిమలను ఏర్పాటు చేసి పూజలు చేసేవారు. ఆపై తడక పందిళ్లు వేసి వినాయకుడిని కొలిచేవారు. ఇప్పుడు ట్రెండ్ మారింది. పూజలకు ఇచ్చే ప్రాధాన్యతతో పాటు పెళ్లి, ఫంక్షన్‌లాగా నవరాత్రులకు భారీ సెట్టింగ్స్ వేయడం ఆనవాయితీగా మారింది. యూత్, వివిధ సంఘాల ఆధ్వర్యంలో భారీ సెట్టింగ్‌లు వేసి విగ్రహాలను నెలకొల్పుతున్నారు.

ఖర్చుకు వెనుకాడటం లేదు..

పట్టణాలతో పాటు గ్రామాల్లో మండపాల ఏర్పాటుకు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. పండుగ వస్తోందంటే వారం పది రోజుల ముందు నుంచే మండపాలపై దృష్టి సారిస్తున్నారు. భారీ ఫంక్షన్లకు వేసే సెట్టింగ్ సామగ్రి అందుబాటులోకి రావడంతో నిర్వాహకులు ఖర్చుకు వెనుకాడటం లేదు. మండపాల ముందు వాటర్ ఫౌంటెయిన్, ఇతర వెరైటీలను ఏర్పాటు చేస్తూ ఆకట్టుకుంటున్నారు.

పెరుగుతున్న గిరాకీ..

మండపాలను ఏర్పాటు చేసే వారికి ఏటేటా డిమాండ్ పెరుగుతుంది. గణపతి నవరాత్రోత్సవాల సమయంలో ముహూర్తాలు ఉండకపోవడంతో ఫంక్షన్ హాళ్లు, ఇతర చోట్ల డెకరేషన్ చేసే వారికి నవరాత్రి మండపాల ఏర్పాటు పనిలో పడ్డారు. ఫంక్షన్ హాళ్లలో ఉపయోగించే షామియానాలు, బల్లలు, ఇతర డెకరేషన్ సామగ్రి గణపతి ఉత్సవాల్లో ఉపయోగపడుతున్నాయి.

కొత్తగా తీర్చిదిద్దుతాం

గణేశ్ ఉత్సవాలు వచ్చాయంటే వారం ముందు నుంచే అ లంకరణపై దృష్టి పెడతాం. ఏటా మండపాలను కొత్తగా తీర్చిదిద్దుతాం. ఏడాదికోమా రు వచ్చే నవరాత్రులపై యు వతలోనూ ఆసక్తి ఉంది. భారీ మండపాల్లో క్రేన్‌ల సహాయంతో విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నాం. ఏటా డిజైన్లు మార్చుతుంటాం.

– రవి పాటిల్, టెక్రియాల్, హనుమాన్ డెకరేటర్స్, కామారెడ్డి

అందరిని కలుపుతుంది

వినాయక చవితికి యువకులం అంతా ఒక చోట కలుస్తాం. ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అందరికి సెట్టింగులపై ఆసక్తి పెరుగు తోంది. ప్రతి వాడలో భిన్న మైన అలంకరణతో మండపాలు ఆకట్టుకుంటున్నాయి. వారం ముందు నుంచే ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు ప్రారంభిస్తాం.

– కాసర్ల రవీందర్, ఏఎంసీ డైరెక్టర్, కామారెడ్డి

సహకార సంఘం గోదాం నిర్మాణ పనులు ప్రారంభం



బండపల్లిలో పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పిట్లం(జుక్కల్): బండపల్లిలో సహకార సంఘం నూతన గోదాం నిర్మాణ పనులను సోమవారం ఎమ్మెల్యే హన్మంత్ సింధే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతుల కోసం రూ.16 లక్షల సహకార సంఘం నిధులతో ఈ గోదాం నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. నాణ్యతతో త్వరగా పూర్తి చేసి రైతులకు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నేతలు విజయ్, సహకార సంఘం చైర్మన్ శ్యాం రెడ్డి, మాజీ ఎంపీపీ రజనీకాంత్ రెడ్డి, వైస్ ఎంపీపీ లక్ష్మారెడ్డి, రాంపూర్ సర్పంచ్ నారాయణరెడ్డి, సీఈవో సంతోష్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సునీత తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాపం పండింది



బాబు అరెస్ట్‌పై ఆనందం వ్యక్తం చేస్తూ శివాలయంలో పూజలు చేస్తున్న పోసానిపేట సర్పంచ్ మహేందర్ రెడ్డి

రామారెడ్డి (ఎల్లారెడ్డి): 2003లో విద్యుత్ సమస్యలపై బషీర్‌బాగ్ దగ్గర ఆందోళన చేస్తున్న రైతులను గుర్రాలతో తొక్కించి కాల్పులు జరిపించి ఐదుగురు రైతుల మృతి కారణమైన చంద్రబాబు నాయుడి పాపం పండిందని పోసానిపేట సర్పంచ్ మహేందర్ రెడ్డి అన్నారు. వ్యవసాయం దండగ అని రైతులను అవమానపరిచిన చంద్రబాబును ప్రజలను నమ్మే పరిస్థితిలో లేరని, చేసిన తప్పులకు కోర్టు శిక్షలు వేస్తామంటే స్టేలు తెచ్చుకోవడం బాబుకి అలవాటేనని, చివరికి చంద్రబాబు పాపం పండి స్కిల్ స్కామ్ కేసులో రూపంలో ముద్దాయిగా తేలి జైలు పాలయ్యాడని మహేందర్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా సోమవారం పోసానిపేట శివాలయంలో పూజలు నిర్వహించారు.

షబ్బీర్ అలీ గెలవాలని పెద్దగుట్టకు పాదయాత్ర



కామారెడ్డి టౌన్/సదాశివనగర్: మాజీ మంత్రి షబ్బీర్ అలీ కామారెడ్డి నియోజకవర్గంలో భారీ మెజార్టీతో గెలవాలని కోరుతూ కామారెడ్డి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం పాదయాత్ర ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ముందు ఆటో యూనియన్ సభ్యులను సన్మానించి పాదయాత్రను డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ రావు ప్రారంభించారు. షబ్బీర్ అలీ గెలుపు కోసం ముడుపులు కట్టి పెద్దగుట్టలో సమర్పిస్తామని ఆటో యూనియన్ నేతలు తెలిపారు. సదాశివనగర్‌లో పాదయాత్రకు స్థానిక నేతలు స్వాగతం పలికారు.

కల్లుగీత పారిశ్రామిక సంఘం కార్యవర్గం ఎన్నిక



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి కల్లుగీత పారిశ్రామిక సంఘం అధ్యక్షుడిగా బాలకిషన్‌గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గౌడ సంఘం నాయకులు సోమవారం తెలిపారు. ఉపాధ్యక్షుడిగా వేణు, డైరెక్టర్లుగా ప్రతాప్‌గౌడ్, భాగ్యమణిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ప్రశాంత్‌గౌడ్, రమేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులున్నారు.

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తీర్మానం



సమావేశంలో పాల్గొన్న రెడ్డి ఐక్యవేదిక నాయకులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఎర్రాపహాడ్‌లో సోమవారం రెడ్డి సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో తీర్మానం చేసినట్లు రెడ్డి ఐక్య వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లవెల్లి కరుణాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు ఏనుగు సంతోష్‌రెడ్డి ఆదేశాల మేరకు కామారెడ్డి జిల్లాలోని ప్రతీ గ్రామంలో రెడ్డి కార్పొరేషన్ ప్రభుత్వం ఏర్పాటు చేయాలని డిమాండు చేస్తూ తీర్మానాలు చేసినట్లు తెలిపారు. 2015 నుంచి పోరాటం చేస్తున్నా రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయలేదని, అగ్ర వర్ణాల్లో పేదలకు గురుకులాల్లో సీట్లు కేటాయించకపోవడం శోచనీయమన్నారు. కామారెడ్డి నియోజక వర్గం నుంచి కేసీఆర్ పోటీ చేయడాన్ని స్వాగతిస్తున్నామని, కాని రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయకపోతే తప్పనిసరిగా గ్రామ స్థాయి నుంచి వ్యతిరేకత తప్పదని హెచ్చరిస్తున్నామన్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ నర్సారెడ్డి, ఎంపీటీసీ జలంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

15వ రోజుకు చేరుకున్న రిలే నిరాహార దీక్షలు



కామారెడ్డి టౌన్: తమను విద్యాశాఖలో విలీనం చేసి, రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ చేపడుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరవధిక దీక్షలు సోమవారానికి 15వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..విద్యాశాఖలో ప్రధానంగా విధులు నిర్వహిస్తున్న తమను ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఈ దీక్షలకు బీడీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ఎన్ ఆజాద్ హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆజాద్ మాట్లాడారు. ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు దామోదర్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు సంపత్, రాములు తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

■ రేపు బీర్కూర్‌లో కాంగ్రెస్ సమావేశం

బాన్సువాడ: బీర్కూర్ మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ సమావేశం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాసుల బాల్‌రాజ్ తెలిపారు. ఈ నెల 17న హైదరాబాద్‌లోని తుక్కుగూడలో జరిగే విజయభేరి సన్నాహక సభకు కో-ఆర్డినేటర్లుగా ఉన్న నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి, కైలాస్ శ్రీనివాస్‌లు హాజరవుతున్నారని అన్నారు.

■ నేడు సదాశివనగర్‌కు ఎమ్మెల్యే రాక

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలానికి నూతనంగా మంజూరైన పీఆర్ డీఈఈ కార్యాలయాన్ని, అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి ఆస్మా అఫ్షీన్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మహేందర్ రెడ్డిలు తెలిపారు.

■ పంచాయతీరాజ్ సబ్‌డివిజన్ కార్యాలయం ప్రారంభం

దోమకొండ: మండల కేంద్రంలో మంగళవారం పంచాయతీరాజ్ సబ్ డివిజన్ కార్యాలయాన్ని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ప్రారంభిస్తారని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగ్ర మధుసూదన్‌రావ్ సోమవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ఉంటుందన్నారు.

చేతివృత్తులకు ప్రభుత్వ సహాయం



బాన్సువాడలో పంచాయితీ రాజ్ డీఈ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ పోచారం

బాన్సువాడ: చేతివృత్తులు చేసుకునే వారికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేస్తుందని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో పంచాయితీ రాజ్ డీఈ కార్యాలయం, విజిలెన్స్, నాణ్యత పరీక్ష కేంద్రం, రూ.25 లక్షలతో నూతనంగా నిర్మించిన నాయీబ్రహ్మణ సంఘం కమ్యునిటీని భవనాలను ప్రారంభించారు. రూ.25 లక్షలతో నూతనంగా నిర్మించే నియోజకవర్గ కురుమ సంఘం భవనానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కులవృత్తులను ప్రోత్సహించేందుకు రూ.లక్ష ఆర్థిక సాయం చేస్తుందని అన్నారు. కుర్మ కులస్తులకు విడతల వారీగా గొర్రెలను పంపిణీ చేస్తున్నామని అన్నారు. ఆర్డీవో భుజంగరావు, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, వైస్ చైర్మన్ జుబేర్, నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు శివరాం, కురుమ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు గంగుల గంగారం, తదితరులున్నారు.

శివాలయాల్లో స్పీకర్ పూజలు

బాన్సువాడ: శ్రావణ మాసం చివరి సోమవారం రోజున దుర్కి శివాలయం, బోర్లం ఆదిబసవేశ్వర ఆలయాల్లో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. బోర్లం ఆదిబసవేశ్వర ఆలయంలో రూ.30 లక్షలలో నిర్మించిన కల్యాణ మండపం, రూ.25 లక్షలతో నిర్మించిన వంటశాల, రూ.10 లక్షలతో వేసిన సీసీ రోడ్డును స్పీకర్ ప్రారంభించారు. నాయకులు పోచారం సురేందర్‌రెడ్డి, సోమాయప్ప, ఏఎంసీ చైర్మన్ నర్రె నర్సింలు, సర్పంచ్‌లు సరళా, శ్యామల, ఎంపీటీసీ శ్రావణి ఉన్నారు.

సేవతోనే సమాజంలో గుర్తింపు

- బీజేపీ నేత వెంకట రమణారెడ్డి



రమణారెడ్డిని సన్మానిస్తున్న గంధం సంఘం సభ్యులు

భిక్కనూరు: సేవలతోనే సమాజంలో గుర్తింపు వస్తుందని బీజేపీ కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. సోమవారం భిక్కనూరు మండల కేంద్రంలోని గంధం, కుమ్మరి సంఘం భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను ప్రజా సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చానని, ప్రజల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నానన్నారు. నిరుపేదలకు సేవలు చేయడం వారి సమస్యలు పరిష్కరించడం, వారికి అవసరమైన సౌకర్యాలను కల్పించడం తాను అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటానన్నారు. మాట ఇవ్వడంతో పాటు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం కూడా తనకు చిన్నతనం నుంచి అలవాటన్నారు. బీజే పీ మండలాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు గురిగంటి నర్సింలు, నేతలు సిద్దరాములు, బాబు పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులపై సవతి తల్లి ప్రేమ తగదు

- టీజేఎస్ నేత నిజ్జన రమేశ్



సౌత్‌క్యాంపస్‌లో మాట్లాడుతున్న నిజ్జన రమేశ్

భిక్కనూరు: కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయకుండా ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపించడం తగదని టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ నిజ్జన రమేశ్ అన్నారు. సోమవారం తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్‌లో కాంట్రాక్టు అధ్యాపకుల సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్టు అధ్యాపకులు సమ్మెకు తాము సంపూర్ణ మద్దతు ఇస్తున్నామన్నారు. టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు కుంభాల లక్ష్మణ్, కాంట్రాక్టు టీచర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ నారాయణ గుప్తా, ప్రతినిధులు యాలాద్రి, నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

జుక్కల్ నియోజకవర్గంలో దళితులకు అన్యాయం



జీపీ వద్ద ఆందోళన చేస్తున్న దళితులు

మద్నూర్(జుక్కల్): జుక్కల్ నియోజకవర్గం ఎస్సీకి రిజర్వ్ అయినా ఇక్కడ దళితులకు మాత్రం తీవ్ర అన్యాయం జరుగుతోందని బీఎస్పీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి రాములు పేర్కొన్నారు. మండల కేంద్రంలో సోమవారం దళితులు, బీఎస్పీ నాయకులు ర్యాలీ నిర్వహించి స్థానిక గ్రామ పంచాయతీ ఎదుట ఆందోళన చేపట్టారు. దళిత నియోజకవర్గంలో దళితులకు అన్యాయం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిజమైన లబ్ధిదారులకు దళిత బంధు ఇవ్వకుండా అధికార పార్టీకి చెందిన వారికే దళితబంధు కేటాయిస్తున్నారని ఆరోపించారు. లబ్ధిదారుల ఎంపికకు పారదర్శక కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్ కార్యాలయానికి వెళ్లి వినతి పత్రం అందించారు.

పాల ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు భూమి పూజ



మర్రి తండాలో భూమి పూజ చేస్తున్న కృష్ణారెడ్డి

మాచారెడ్డి: మర్రి తండా శివారులో కేజీ రెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్(హైదరాబాద్) ఆధ్వర్యంలో సోమవారం బంజారాల దుస్తుల తయారీ, పాల ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు ఆ కళాశాల చైర్మన్ కృష్ణారెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మర్రి తండా, నెమలి గుట్ట తండా, సర్దాపూర్, సోమారంపేట గ్రామాల గిరిపుత్రులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. డీటీఎస్ ప్రతిపాదనతో రూ.కోటి 47 లక్షల వ్యయంతో ఈ ప్రాజెక్టును నిర్మించనునట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయ, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్, రైతుబంధు అధ్యక్షుడు నర్సింలు, ఉపసర్పంచ్ అనిల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రుణమాఫీ

- కాంగ్రెస్ నేత మదన్ మోహన్ రావు



మదన్‌మోహన్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు ఒకే సారి రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని పీసీసీ ఉపాధ్యక్షుడు మదన్ మోహన్ రావు అన్నారు. సోమవారం ఎల్లారెడ్డి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మదన్‌మోహన్ యూత్ ఫోర్స్ సభ్యులు ఆయనను గజమాలతో సన్మానించారు. మదన్‌మోహన్‌కు తెలంగాణ కమ్యూనికేషన్ వైస్ చైర్మన్ పదవిని ఏఐసీసీ ప్రకటించడంతో వారు కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం మదన్‌మోహన్ కార్యకర్తల నుద్దేశించి మాట్లాడారు. కాంగ్రెస్ అదిష్టానం తనపై నమ్మకముంచి తెలంగాణ రాష్ట్ర కమ్యూనికేషన్ కమిటీకి వైస్ చైర్మన్‌గా నియమించిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన రానున్నదని అన్నారు. మదన్‌మోహన్ ట్రస్టు ద్వారా జాబ్ మేళాలు నిర్వహించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నానని అన్నారు. దళిత, బీసీ బంధులు బీఆర్ఎస్ కార్యకర్తల బంధు పథకంగా మారిందని విమర్శించారు. నాయకులు ఆరీఫ్, రాజు, అజర్, సిద్దు, భరత్ తదితరులున్నారు.

సంక్షిప్తం

మొక్కల పంపిణీ



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని 47వ వార్డులో కాలనీవాసులకు వార్డు కౌన్సిలర్ గెరిగంటి స్వప్న మొక్కలను పంపిణీ చేశారు. ప్రతీ ఇంటి ముందు మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని కోరారు. బీఆర్ఎస్ నాయకుడు లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

దళిత బంధును అర్హులకు ఇవ్వాలి



మాచారెడ్డి: దళిత బంధు పథకాన్ని అర్హులకు మాత్రమే ఇవ్వాలని మాచారెడ్డి మండల కేంద్రంలోని అంబేడ్కర్ యువజన సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమావేశమైన అంబేడ్కర్ సంఘం ప్రతినిధులు అర్హులకు ఇవ్వాలని తీర్మానం చేస్తూ ఉపసర్పంచ్ రామచంద్రంకు తీర్మానం కాపీని అందజేశారు. అలాగే అంబేడ్కర్ సంఘం తీర్మానాన్ని ఆమోదిస్తూ గ్రామపంచాయతీ పాలకవర్గం, ఎంపీడీవోకు వినతిపత్రం అందజేయనున్నట్లు పాలకవర్గం సభ్యులు తెలిపారు.

వైభవంగా సంత్ సేనా మహరాజ్ పుణ్యతిథి

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని మల్లేశ్వర ఆలయంలో సోమవారం వార్కారీలు, భజన మండళ్లు, భక్తులు హరినామ సప్తాహం, సంత్ సేనా మహరాజ్ పుణ్యతిథి నిర్వహించారు. శ్రావణమాసం ముగుస్తుండడంతో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సప్తాహం జరిపించారు. ప్రతి ఏడాది శ్రావణమాసంలో హరినామ సప్తాహం నిర్వహిస్తామని వార్కారీలు వడ్లగోపి, బాలు తెలిపారు. భక్తులకు అన్నదానం చేశారు.

డోంగ్లీ పీహెచ్‌సీ డాక్టర్‌గా గిరీష్



మద్నూర్(జుక్కల్): డోంగ్లీ పీహెచ్‌సీ వైద్యుడిగా గిరీష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోగులకు ఎల్లవేళలా వైద్యం అందిస్తామని ఆయన చెప్పారు. గర్భిణులు, బాలింతలు ఆరోగ్య కేంద్రంలో క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఉన్నారు.